# చురుకైన అబ్బాయి

**నా**కేసి జాలిగానూ, చీదరింపుతోనూ చూశాడు;

"మీ ముసలాళ్ళు మీకే అన్నీ తెలుసుననుకుంటారు. నిజం చూస్తే మీకన్నా మాకే ఎక్కువ తెలుసు" అన్నాడు చురుకైన కుర్రాడు.

"ఎందువల్లను?" అన్నాను.

"మీరు పెద్దవాళ్ళూ మేం చిన్నవాళ్లమూ గనక."

"మేమూ ఒకప్పుడు చిన్నవాళ్ళమేగా?" అన్నాడు.

"అప్పుడు మీకు మీ ముసలాళ్ళకన్న ఎక్కువ తెలుసేమో?"

"ఆ యేటి కాయేడు మీదపడ్డ కొద్దీ తెలిసింది కాస్త హరించి పోయిందా ఏమిటి?"

"తెలీటానికి అనుభవంతో ఏమి సంబంధం లేదు. పెద్దయిన కొద్దీ మీరు దొంగవాళ్ళుగా తయారై మా కుర్రవాళ్ళని మోసం చెయ్యటానికి ప్రయత్నిస్తారు. ఏ పాతికేళ్ళో రాగానే మీరు చచ్చిపోతే ప్రపంచం ఎంత బాగవుతుంది."

చురుకైన కుర్రాడి అంచనా ప్రకారం నేను చచ్చిపోయే అర్హత సంపాదించి ఓ పుష్కరం అయ్యింది. "పాతికేళ్ళు నిండితే నువ్వేం చేస్తావు?" అన్నాను.

కుర్రాడి మొహం చూస్తే అడగరాని ప్రశ్న అడిగినట్లు తోచింది.

"ముసలాణ్ని కాకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను. చాతకాక పోతే చచ్చిపోతాను."

కుర్రాడికి ధైర్యసాహసాలకి లోటు లేనట్లు కనిపించింది. నాకంటే నయమే. నాకింకా చావాలని లేదు.

విషయం మార్చాను.

"నీకన్ని విషయాలు తెలుసునా?" అన్నాను.

"ఓ!" అన్నాడు కుర్రాడు.

నిట్టూర్చి "ఎంత అదృష్టం! ఎప్పుడు నేర్చుకున్నావు?" అన్నాను.

కుర్రాడు మరింత అసహ్యంగా నాకేసి చూసి, "మీ ముసలాళ్ళ కెంత చెప్పినా తలకెక్కదు. ఈ విషయాలు నేర్చుకుంటే రావు. అవి తెలియవలసిందే" అన్నాడు.

"ఎట్లా తెలుస్తాయి?" అన్నాను.

"తలకాయ ఉంటే సరి" అన్నాడు కుర్రాడు.

"తలకాయ ఉన్నంత మాత్రానికే అన్వేషించకుండా, పరిశోధించకుండా నిజం తెలుస్తుందా?" అన్నాను.

కుర్రాడు వింతగా, "నిజమేమిటి?" అని అడిగాడు.

నిజమంటే ఏమిటో చెప్పటానికి కూడా నాకు తెలివితేటలు లేవనేది బయటపడింది.

నేను తడువుకుంటూ "ప్రత్యక్షానుభవం వెనక ఉండే సత్యం!" అన్నాను.

"అటువంటిదేమీ లేదు" అన్నాడు కుర్రాడు.

"మరి సిద్ధాంతాలెట్లా చేస్తాం?" అన్నాను.

"ఏం సిద్ధాంతాలు?" అన్నాడు తిరస్కారంగా.

"సిద్ధాంతాలకేం బోలెడన్ని ఉన్నై. భూమి గుండ్రంగా నారింజపండు లాగుందని ఒక సిద్ధాంతం. భూమి, ఇతర గ్రహాలు సూర్యుడిచుట్టూ తిరుగుతున్నాయని మరో సిద్ధాంతం. శాస్త్రజ్ఞులు కూడా అనేక సిద్ధాంతాలు చేశారు. ఎంతో పరిశోధన చేసి, ఎంతమంది జుట్టో నెరిస్తే గాని ఈ సత్యాలు బయటపడలేదు."

"వొట్టిది! అన్నీ అబద్ధాలు! పచ్చి వంచన! శాస్త్రజ్ఞులయేది, రాజకీయజ్ఞులయేది, ఎవరికిష్టమైన విషయాలు వాళ్ళు నమ్ముతారు. ఎవరి అభిరుచి వారిదీ! భూమి గుండ్రంగా లేదని నాకు తెలుసు. సూర్యుడే భూమి చుట్టూ తిరుగుతున్నాడు. నా యిష్టం నాది!"

"శాస్త్రజ్ఞులు చేసిన కృషి యావత్తూ వృథాయే?"

"శుష్కదండగ."

మళ్ళీ నాకు గోడ అడ్డయింది. ప్రక్కకు తిరిగాను.

"పోనీ, నువ్వు చెప్పినట్టే అనుకుందాం. ఎవరి ఇష్టమొచ్చినట్టు వాళ్ళనుకునే పక్షంలో, అభిప్రాయభేదం వస్తే ఎవరి అభిప్రాయం సరి అయినట్టు? ఎవరిది తప్పయినట్టు?"

"ఎవరి అభిప్రాయం వాళ్ళకు రైటు!"

"మా ముసలాళ్ళు తెలివి తక్కువ వాళ్ళన్నావే? మా అభిప్రాయాలు మాకు రైటేగా?"

"కావలిస్తే అట్లాగే అనుకోవచ్చు. మీ అభిప్రాయాలు తప్పని మా కుర్రాళ్ళకి తెలుసుగా?"

"నేననుకునే దానికన్న నువ్వనుకునేది ఎక్కువ నిజమని నీ అభిప్రాయం. అవునా, కాదా?"

"అవును" అన్నాడు కుర్రాడు.

"అయితే నిజమంటే ఏమిటి?" కుర్రాడు చిక్కాడనుకున్నాను.

"నేననుకునేది!" అన్నాడు కుర్రాడు.

"నేననుకునేదే నిజమని నేనూ అంటాను. ఇన్ని రకాల నిజాలకి ప్రపంచంలో స్థానం వుందా?"

"లేనప్పుడు, మాతో ఏకీభవించని వాళ్ళని చంపేసి మా నిజమే చలామణిలో ఉంచుతాం." అదీ సబబుగానే ఉంది.

"మా ముసలాళ్ళతో అభిప్రాయ భేదం వస్తే మమ్మల్ని చంపేస్తావు బాగానే వుంది! నీసాటి కుర్రాళ్ళతోనే అభిప్రాయ భేదం వస్తే?"

"వాళ్ళనీ పాతేస్తాం. మీ ముసలాళ్ళ మాటలు విని చెడిపొయ్యే కుర్రాళ్ళుండరనా?"

"నీమాట వింటే బాగుపడేటట్టూ, నీ మాట వినకపోతే చెడిపోయినట్టూనా?"

"నా దృష్టిలో అంతేగా?"

"ఇంతమందిని చంపెయ్యాలంటే నీకు కొంతమంది మద్దతు అయినా వుండాలి కదా, మీ సమాజానికి నాయకుడెవరు? ఇంతమందిలో ఎవరి అభిప్రాయాలు ఆమోదించాలో నీకెట్లా తెలుస్తుంది?" అన్నాను.

"చాదస్తంగా మాట్లాడకు, నేనే నాయకుణ్ని. నాతో ఏకీభవించే వాళ్ళందరూ నాతో వచ్చేస్తారు."

"వాళ్ళెక్కువమంది లేకపోతే?"

"ఎందుకుండరు? మొదట్లో ఓ పాతిక మందిమి వున్నప్పటికీ ఒక్కొక్కరిని హడలగొట్టి మాలో కలుపుకుంటాం. ఈ విధంగా ఎన్ని లక్షలమందిమైనా అవుతాం. అప్పుడు మా విశ్వాసాలకెవరూ ఎదురు చెప్పలేరు. చెప్పిన వాళ్ళని చంపేస్తాం."

"నువ్వంత బలవంతుడివయే లోపల మిగతా వాళ్ళు నీ అభిప్రాయాలు ప్రచారం చెయ్యకుండా అడ్డుపడితే?"

"ఏమిటి? నా అభిప్రాయాలు నేను ప్రచారం చేసుకునే హక్కు కూడా నాకివ్వరా?"

"నీకు డెమోక్రసీలో ఎంత విశ్వాసం వుందీ!" అన్నాను.

"కొంత వరకు డెమోక్రసీ మంచిదే. కొంతవరకు ఏదైనా మంచిదే!"

చురుకైన అబ్బాయి చెప్పిన అభిప్రాయాలన్నీ ఒక దండ గుచ్చాయి.

"అయితే నీ రకం నిజం అమల్లోకి రావాలంటే ముందు ముసలాళ్ళంతా ఆత్మహత్య చేసుకోవాలన్నమాట. ఆ తరవాత స్వేచ్ఛగా లాఠీలతో నీ విశ్వాసాలను నువ్వు ప్రచారం చేసుకుంటే, నీ బలం తన బలం కంటే హెచ్చిపొయ్యే వరకూ ప్రపంచం చూస్తూ ఊరుకోవాలన్నమాట. ఇట్లా లాఠీ ప్రయోగంతో సాధించిన ఐకమత్యంతో నీ మతం వారంతా కలిసి, మీతో ఏకీభవించని వారందరిని హత్య చేసేసి, నిజం స్థాపించేస్తారన్న మాట. అన్వేషణలూ, పరిశోధనలూ, తర్కమూ, అనుభవమూ, సిద్ధాంతాలూ వాటి

సంస్కరణా ఏమీ అవసరం లేదన్న మాట! తెలివితేటలూ, నిజం తెలుసుకునే శక్తీ నీ ప్రపంచంలో పుట్టుకతోనే వచ్చేస్తాయన్నమాట."

"ఈ ప్రపంచానికంతకీ అధినాయకుడివి నువ్వన్నమాట! నీతో ఏకీభవించలేని వారంతా ముసలితనం వచ్చిందని గుర్తించి ఆత్మహత్యలు చేసుకోవాలన్నమాట?" అన్నాను.

"అందులో తప్పేముంది? అందరూ నే చేసే ప్రయత్నమే చేస్తున్నారు. అయితే వాళ్ళకి సరి అయిన అభిప్రాయాలు లేక, పద్ధతులు లేక ఓడిపోతున్నారు. నేను జయిస్తాను. ప్రపంచమంతా నా పాదాల కింద పెట్టి తొక్కేస్తాను" అన్నాడు.

నాకేదో ఆవేశం వచ్చినట్టయింది. అప్రయత్నంగా వాడి పీక పట్టుకొని, "వెధవా! నిన్నిప్పుడు పీక నులిమేస్తే ఏం చేస్తావు? నీ రాక్షసత్వమంతా బయట పెట్టుకోడానికిప్పుడే సాహసించటం నీ పొరపాటు? కొంతకాలం ఆగవలసింది!" అని వాడి పీక నొక్కెయ్యసాగాను.

"నన్ను చంపుతావుట్రా, ముసలి పీనుగా! నీ చేతులు పడిపోనూ! చిన్న పిల్లవాణ్ని చేసి నీ పిశాచబలం నా మీద చూపిస్తావుట్రా?" అని కుర్రాడు అరవసాగాడు. నలుగురూ చేరారు. కుర్రాణ్ని విడిపించారు. "నీకేం పొయ్యేకాలం? లేత వెధవని పట్టి గొంతు పిసుకుతావా? నీకు పిల్లల్లేరా?" అని అడిగారు.

కుర్రాడు నాకేసి గర్వంగా చూసి మెడ తడువుకుంటూ "చూసుకో, నా తడాఖా! ప్రపంచమంతా నా పక్షం ఉంది. ఇందాకణ్నుంచి ప్రపంచం తరఫున వకాల్తా తీసుకొని మహా పేలావు. ఇప్పుడు పేలు!" అంటూ ఠీవిగా నడిచి వెళ్ళిపోయాడు. చుట్టూ పోగయిన వాళ్ళలో నాకేసి చూసినవాళ్ళు లేరు. అందరూ వాడు వెళ్ళిన దిక్కే చూస్తున్నారు. అందరి మొహాల మీద ఆప్యాయంగా చిరునవ్వు తాండవిస్తున్నది.

"కుర్రాడెవరో గాని ఎంత ముద్దొస్తున్నాడు!" అన్నదో ముసలి తొక్కు.

"చాలా చురుకైన కుర్రాడు. ముందు ముందు పైకొస్తాడు!" అన్నాడు పళ్ళులేని ముసలాయన. పాముపిల్ల ప్రాణంతో తప్పించుకుపోయింది. అయితే ఏం? నేను ఇంకా జీవించే ఉన్నాను. నాదీ మొండి ప్రాణమే. ఇంతట్లో చావను! ఈ పాము నాకందేసరికి బాగా కోరలు పెరిగి బుసకొడుతూ ఉంటుంది. నేను మంచి దుడ్డు కర్ర వెతుక్కోవాలి. చేతులతో పని కాదు.

***మొదటి ముద్రణ : ఆంధ్రజ్యోతి, 1 మే 1946***